

ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న కృష్ణన్, శైలజా తదితరులు

## నెక్లెస్ రోడ్‌లో అలీప్ వీకార్ట్ ఎగ్జిబిషన్

ఖైరతాబాద్, డిసెంబర్ 29 : మహిళా ఆర్థిక స్వావలంబన లక్ష్యంగా అసోసియేషన్ ఆఫ్ లేడీ ఎంట్రప్రీనియర్స్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నెక్లెస్‌రోడ్‌లోని పీపుల్స్ ప్లాజాలో 'అలీప్ వీకార్ట్' పేరుతో ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశారు. ఈ ఎగ్జిబిషన్‌ను యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జనరల్ మేనేజర్ ఎన్.కృష్ణన్, ఐసీఐసీఐ బ్యాంకు రీజినల్ మేనేజర్ సచిన్ మిశ్రా, హెచ్‌డీఎఫ్‌సీ స్టార్టప్ మేనేజర్ నివ్రాన్షు అగర్వాల్, ఎంఎస్‌ఎంఈ అసిస్టెంట్ డైరెక్టర్ నవీన్ కుమార్, అసోసియేషన్ ఆఫ్ లేడీ ఎంట్రప్రీనియర్స్ ఆఫ్ ఇండియా వైస్ చైర్‌పర్సన్ బి.శైలజతో కలిసి ప్రారంభించారు. అనంతరం మహిళలు రూపొందించిన చేతి వృత్తులు, హస్తకళలతో పాటు జూవెల్లరీస్, జ్యూట్ బ్యాగ్స్ తదితర 72 స్టాళ్లను సందర్శించారు. దివ్యాంగ మహిళల స్టాళ్లకు వారు చెల్లించిన మొత్తంలో 100శాతం, ఇతరులకు 80శాతం రీయింబర్స్‌మెంట్ ఇస్తామని అలీప్ వైస్ చైర్‌పర్సన్ శైలజ తెలిపారు. ఈ ఎగ్జిబిషన్ 31వ తేదీ వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాబార్డ్ డీజీఎం వి.శ్రీరామ్, అలీప్ కోశాధికారి శ్రీమహాలక్ష్మి, కార్యదర్శి వి.శ్రీదేవి, కంపెనీ సెక్రటరీ శ్రావణి తదితరులు పాల్గొన్నారు.




## జనవరి 11నుంచి హైలైఫ్ ఎగ్జిబిషన్

### కర్టెన్ రైజర్‌లో సందడి చేసిన హీరోయిన్లు

బంజారాహిల్స్, డిసెంబర్ 29 : దేశంలోని ప్రముఖ డిజైనర్లు రూపొందించిన ఫ్యాషన్, లైఫ్‌స్టైల్, ఆభరణాల ఉత్పత్తులతో జనవరి 11నుంచి 13వరకు మాదాపూర్‌లోని హెచ్‌ఐసీసీ నోవాటెల్‌లో హైలైఫ్ ఎగ్జిబిషన్ నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన కర్టెన్ రైజర్ కార్యక్రమం బంజారాహిల్స్ రోడ్ నం.10లోని మార్క్స్ మీడియా సెంటర్‌లో శుక్రవారం ఉత్సాహంగా జరిగింది. టాలీవుడ్ హీరోయిన్లు శుభశ్రీ రాయగురు, ప్రీతీ సుందర్‌తో పాటు మోడల్స్ ఎగ్జిబిషన్‌కు సంబంధించిన బ్రోచర్లను ఆవిష్కరించి సందడి చేశారు.



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న వక్తలు

## 'నీరజ కథా కదంబం, ఊహల అల్లికలు' ఆవిష్కరణ

రవీంద్రభారతి, డిసెంబర్ 29 : వంశీ ఆర్ట్స్ థియేటర్స్ ఆధ్వర్యంలో రవీంద్ర భారతిలోని సమావేశం మందిరంలో నీరజ హరిప్రభల రచించిన నీరజ కథా కదంబం 'కతా సంపుటి', 'ఊహల అల్లికలు' కవితా సంపుటి ఆవిష్కరణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రముఖ సాహితీవేత్త వోలేటి పార్వతీశం సభా అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమానికి వక్తలుగా ప్రముఖ గేయరచయిత డా.సుద్దాల అశోక్‌తేజ, రచయిత్రి కేవీ కృష్ణకుమారి, ఏపీ సంగీత నాటక అకాడమీ మ్యూజిక్ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ అయ్యగారి శ్యామసుందరం, అయ్యగారి జయలక్ష్మి శ్యామసందరం తదితరులు విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి సంపుటీలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వంశీఆర్ట్స్ థియేటర్ అధినేత డా.వంశీరామరాజు, జ్యోతి వలబోజు, తదితరులు పాల్గొన్నారు.

# కొత్త బస్సులకు నిధులెలా..?

**నగర రోడ్లపై 2700 కాలం చెల్లిన బస్సులు**

**వీటన్నింటినీ స్క్రాప్‌గా గుర్తించాలని రవాణా శాఖ ఆదేశాలు**

**పాత బస్సులకు కొత్త బాడీ తగిలించి.. రోడ్లపై తిప్పే ప్రయత్నం**

**ప్రస్తుతం తిరుగుతున్న 280 అద్దె బస్సులకు ముగుస్తున్న గడువు**

**340 అద్దె బస్సుల కోసం టెండర్లు.. ముందుకు రాని ఓనర్లు**

**జనవరి 5 నుంచి పూర్తిగా బంద్ చేస్తామని అల్టిమేటం**

**మహాలక్ష్మి పథకంతో కిక్కిరిసిపోతున్న బస్సులు**

**అధిక రద్దీతో బస్సులు నడుపలేమంటున్న డ్రైవర్‌లు**

**సంకట పరిస్థితి ఎదుర్కొంటున్న ఆర్టీసీ**




సిటీబ్యూరో, డిసెంబర్ 29 (నమస్తే తెలంగాణ) : కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మహాలక్ష్మి పథకంలో భాగంగా ప్రవేశ పెట్టిన ఉచిత బస్సు ప్రయాణానికి మహిళల నుంచి భారీ స్పందన వస్తుంటే.. ఆర్టీసీ యాజమాన్యానికి మాత్రం తలనొప్పి అవుతున్నది. ఈ పథకం అమలుతో ఒక్క సారిగా ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరుగడంతో పాటు బస్సులన్నీ కిటకిటలాడుతున్నాయి. అయితే బస్సు సామర్థ్యాన్ని మించి ప్రయాణికులు ఎక్కుతుండటంతో డ్రైవర్లు, కండక్టర్లు కూడా అనేక ఇబ్బందులు పడాల్సిన పరిస్థితులు ఎదురవుతున్నాయి. దీంతో ఇప్పుడున్న బస్సులకు రెండింతలు పెంచాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. అందులో భాగంగానే ఆర్టీసీ కొత్త బస్సులు కొనుగోలు చేసే ప్రయత్నానికి శ్రీకారం చుట్టింది. కానీ అందుకు తగిన నిధుల కొరత ఆర్టీసీని పట్టి పీడిస్తున్నది. అయితే రూ.400 కోట్లు వెచ్చించి 1050 కొత్త బస్సులను కొనుగోలు చేస్తామని యాజమాన్యం శుక్రవారం స్పష్టం చేసింది. అయితే అందుకు సంబంధించిన నిధుల సమీకరణ ఏ విధంగా జరుగుతుందన్న అంశంపై మాత్రం యాజమాన్యం క్లారిటీ ఇవ్వడం లేదు. ముందస్తు ప్రణాళికలు లేకుండా.. ఇలాంటి పథకాలు ప్రవేశ పెట్టి ఉండాల్సింది కాదన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.

### తిరిగేవన్నీ పాత బస్సులే..

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో తిరుగుతున్న సిటీ బస్సులన్నీ 2010 కంటే ముందు కొనుగోలు చేసినవే. వీటికి 15 ఏండ్లు దాటడంతో కాలం చెల్లినవిగా రవాణా శాఖ పరిగణిస్తున్నది. నగరంలో మొత్తం 2700 పాత బస్సులకు కొత్త బాడీ తగిలించి, కొత్త బస్సులుగా రోడ్లపై తిప్పే ప్రయత్నాలు జోరుగా చేస్తున్నారు. అయితే పాత బస్సులన్నింటిని తక్షణమే స్క్రాప్‌గా గుర్తించి, వాటికి బదులుగా కొత్త బస్సులు కొనుగోలు చేయాల్సి ఉన్నప్పటికీ ఆర్టీసీ మాత్రం ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు. అద్దె బస్సులపైనే ఆధార పడుతుంది.

### ఈవీ బస్సులపై భరోసా ఏదీ..?

కేసీఆర్ ప్రభుత్వం గత ఏడాదిలో 540 విద్యుత్ బస్సుల కొనుగోలుకు చర్యలు చేపట్టింది. కానీ ఈ విషయంలో ఆర్టీసీ తీసుకున్న తొందరపాటు నిర్ణయాల వల్ల ఈ ఆర్థిక సంవత్సరంలో ఈవీ బస్సులు వచ్చే అవకాశం లేకుండా పోయింది. కనీసం 2024-25 ఆర్థిక సంవత్సరంలోనైనా ఈవీ బస్సులు వస్తాయని ఆర్టీసీ భరోసా ఇవ్వడంలేదు.

### జనవరి 5నుంచి అద్దె బస్సులు తిప్పం

ప్రస్తుతం మహలక్ష్మి పథకం అవసరాలకు అనుగుణంగా బస్సుల సంఖ్య పెంచుకోవాలని ఆర్టీసీ భావిస్తున్నప్పటికీ కొత్త బస్సులకు బదులుగా అద్దె బస్సులపై దృష్టి సారించింది. అందుకోసం నగర అవసరాల కోసం 340 అద్దె బస్సుల కోసం టెండర్లు దాఖలు చేసినప్పటికీ స్పందన పెద్దగా కనిపించడం లేదు. ఈ పథకం వల్ల అద్దె బస్సుల యజమానులు కూడా తీవ్ర అంతృప్తిగానే వ్యవహరిస్తున్నారు. ఇదిలా ఉంటే ప్రస్తుతం అద్దె ప్రాతిపదికన నగరంలో నడుస్తున్న దాదాపు 280పైగా అద్దె బస్సుల గడువు మించిపోతుంది. ఈ గడువు ముగిసే లోగా కొత్త టెండర్లు ముగించి, అద్దె బస్సుల కోసం ఆర్డర్లు ఇవ్వాల్సి ఉంది. కానీ ఈ ప్రక్రియ కొంత వరకు గందరగోళ పరిస్థితి ఎదుర్కొనే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తుంది. ఉచిత బస్సు ప్రయాణంతో అద్దె బస్సులకు అనేక ఇబ్బందులు కలుగుతున్న నేపథ్యంలో ఆ సమస్యలను పరిష్కరిస్తేనే తాము ఆర్టీసీకి సహకరిస్తామని ప్రైవేటు బస్సుల యాజమాన్య సంక్షేమ సంఘం ప్రతినిధులు స్పష్టం చేస్తున్నారు. లేదంటే జనవరి 5 నుంచి అద్దె బస్సులు తిప్పకుండా సమ్మెకు వెళ్తామని ఆర్టీసీ యాజమాన్యానికి అల్టిమేటం జారీ చేసింది. ఇలాంటి పరిస్థితుల్లో ఆర్టీసీ యాజమాన్యం ఉచిత బస్సుల పథకం సజావుగా సాగడానికి ఎలాంటి చర్యలు తీసుకుంటుందో అని సర్వత్రా ఎదురు చూస్తున్నారు.



## ఆకట్టుకుంటున్న వస్త్ర ప్రదర్శన

బంజారాహిల్స్, డిసెంబర్ 29: బంజారాహిల్స్ రోడ్ నం.12లోని కళింగ కల్చరల్ సెంటర్‌లో కొనసాగుతున్న 'హ్యాండ్ టు ఇండియా' ఎగ్జిబిషన్ నగర వాసులను విశేషంగా ఆకట్టుకుంటున్నది. ఈ నెల 22న ప్రారంభమైన ప్రదర్శన 31వరకు కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. సాంప్రదాయ చేనేత, పట్టు, కలంకారీ, చండేరీ, భాగల్పూరీ తదితర వెరైటీల చీరలు ఇక్కడ అందుబాటులో ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.

## ప్రకృతి ఒడిలో న్యూ ఇయర్ వేడుకలు

**నగరానికి దూరంగా అడ్వెంచర్ ఉత్సవాలు**

**కొత్త ఏడాదికి అదిరిపోయేల ఏర్పాట్లు**

**అనంతగిరి నుంచి అడ్డాకల్ వరకు పార్టీలు**

సిటీబ్యూరో, డిసెంబర్ 29 ( నమస్తే తెలంగాణ ) : 'డిసెంబర్ 31' పార్టీని క్లబ్‌లు, పబ్‌లు, రెస్టారెంట్‌లలో చేసుకోవడం సహజమే. కానీ అదే నైట్ ప్రకృతి ఒడిలో గడిపితే ఎలా ఉంటుంది? అందుకోసం నగరంలోని అనంతగిరి హిల్స్‌ను ఎంచుకుంటున్నారు కొందరు నిర్వాహకులు. క్యాంప్ అండర్ ద స్టార్స్ థీమ్‌తో కొత్త ఏడాది పార్టీని నగరవాసులకు అందించబోతున్నారు. అక్కడ ట్రెక్కింగ్, సన్‌సెట్స్, మ్యూజిక్, డ్యాన్స్, బార్బెక్యూ తదితర సందడి ఉండేల ఏర్పాట్లు ఉండనున్నాయి. ఈ పార్టీకి నగరవాసుల నుంచి విశేష స్పందన వస్తుందని నిర్వాహకులు తెలిపారు. ప్రకృతి ఒడిలో సేద తీరుతూ.. పైన ఆకాశం.. చుట్టూ చెట్లు, కొండల మధ్య రాత్రంతా వివిధ సందడి కార్యక్రమాలతో గడిపేలా ఏర్పాట్లు చేశారు. దీంతో పాటు నగరానికి దూరంగా వనపర్తిలోని అడ్డాకల్ గ్రామ సమీపంలో ది ఔట్ డోర్ ప్రాజెక్టు పేరుతో కొత్త ఏడాది ఉత్సవాలను జరుపబోతున్నారు. ఈ ఈవెంట్‌కు నగరం నుంచి దంపతులను ఆ సంస్థ ఆహ్వానిస్తున్నది. పల్లె కల్చర్.. సద్ది భోజనం, పక్షుల కిలకిలరావాల మధ్య సందడి ఉండేల ఏర్పాట్లు చేస్తున్నది. మిస్టీ5 న్యూ బ్లాస్ట్ ఆధ్వర్యంలో 'ఎగ్జైటింగ్ నైట్ ఆఫ్ మింగ్లింగ్' థీమ్‌తో న్యూ ఇయర్ వేడుకను చేయబోతున్నారు. ఈ కార్యక్రమానికి లండన్ నుంచి ప్రముఖ డీజే ఆండ్రా, ఎంటీవీ స్ప్లిట్స్‌విల్ల సందడి చేయనున్నారు. ఇదిలా ఉండగా నగరంలోని కొన్ని గేటెడ్ కమ్యూనిటీల వాసులు అంతా ఒకే దగ్గర కలిసి న్యూ ఇయర్ వేడుకలు ఘనంగా జరుపుకునేల ఏర్పాట్లు చేసుకున్నారు. దీంతో శ్రీ కన్వెన్షన్ సెంటర్‌లో కూడా స్టార్ స్టడెడ్ నైట్ పార్టీ జరుగబోతుంది. వీటితో దక్కన్ ట్రాయల్స్, గ్రాండ్ ఓపెన్ ఏయిర్ ఫెస్టివిటీ, డజ్‌లింగ్ నైట్ తాజ్ బంజారా తదితర పార్టీలు కూడా జరగబోతున్నాయి.

## 4న టీహబ్‌లో అసిస్టివ్ టెక్నాలజీపై చర్చ

సిటీబ్యూరో, డిసెంబర్ 29 (నమస్తే తెలంగాణ) : తెలంగాణ స్టేట్ ఇన్నోవేషన్ సెల్ (టీఎస్‌ఐసీ) ఆధ్వర్యంలో అసిస్టివ్ టెక్నాలజీ సమ్మిట్‌పై జనవరి 4న చర్చా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని చీఫ్ ఇన్నోవేషన్ ఆఫీసర్ శాంతా తౌటం తెలిపారు. టీ హబ్‌లో జరిగే కార్యక్రమంలో అసిస్టివ్ టెక్ ఫౌండేషన్ కో ఫౌండర్, సీఈఓ ప్రతీక్ మాధవ్, యూత్ ఫర్ జాబ్స్ ఫౌండర్ సీఈఓ మీరా షెనాయ్, ఇండియన్ బ్లైండ్ క్రికెట్ టీమ్ ప్లేయర్ మహేందర్ వైష్ణవ్ పాల్గొంటున్నారని తెలిపారు. అదేవిధంగా హనీబీ నెట్ వర్క్ ఆధ్వర్యంలో జనవరి 3న ఆవిష్కరణల ప్రాధాన్యతపై టీచర్స్, స్టార్టప్స్, ఎంటర్‌ప్రెన్యూర్స్‌తో వర్క్‌షాపును సైతం నిర్వహిస్తున్నామని తెలిపారు.